



18వ వసంతంలోకి...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## ఎన్టీఆర్ - కృష్ణా

ఆదివారం 6 ఏప్రిల్ 2025 | పేజీలు 8


### నందిగామకు....

# వరాల జల్లు

వివరాలు 2లో...

- దేశంలో ఏ వ్యక్తి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో పీ 4 రూపకల్పన
- ముప్పాళ్ళ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ఆదేశాలు జారీ
- పీ4 మార్గదర్శిలకు సన్మానం
- ఇద్దరు పిల్లలకు మించి కనాలని సభాముఖంగా పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు









## ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వ భరోసా

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందించిన ముఖ్యమంత్రి

వివరాలు 2 లో







2

## వైభవంగా ప్రారంభమైన శ్రీరామనవమి కల్యాణోత్సవాలు

### సాంప్రదాయం సాంకేతికత మేళవింపు

## 'ఇంద్రియ'



వివరాలు 8లో...

వివరాలు లోపలి పేజీల్లో...



## వాడవాడలా జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

# నందిగామకు వరాల జల్లు

దేశంలో ఏ వ్యక్తి పేదరికంలో ఉండకూడదనే

లక్ష్యంతో పీ 4 రూపకల్పన

ముప్పాళ్ళ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ఆదేశాలు జారీ

పీ4 మార్గదర్శిలకు సన్మానం

ఇద్దరు పిల్లలకు మించి కనాలని సభాముఖంగా పిలుపునిచ్చిన

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






**నందిగామ/చందర్లపాడు ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** సమాజంలో అందరికీ అవకాశాలు కల్పించాలని సీఎం చంద్రబాబు తెలిపారు. మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడాలని చెప్పారు. దేశంలో ఉన్న ఏ వ్యక్తీ పేదరికంలో ఉండకూడదని అన్నారు. దేశంలోనే ఎక్కువ పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని ఉద్ఘాటించారు.భారత మాజీ ప్రధానమంత్రి జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో జిల్లా కలెక్టర్ జి లక్ష్మీ షా అధ్యక్షతన జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ముందుగా మాజీ రాష్ట్రపతి బాబు జగజ్జీవన్ రావు 117వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి చంద్రబాబు నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ప్రభుత్వ విప్,స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వేదాద్రి స్కీమ్, ఏటూరు మొగులూరు కాజ్వే, సుబాబుల్ మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాచిన్ని మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు లాంటి ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి దొరకటం రాష్ట్ర ప్రజలు అదృష్టం అన్నారు. చంద్రబాబు నాయుడు ఆలోచన ఆలోచనలు ఎప్పుడు 20 సంవత్సరాలు ముందు ఉంటాయని ఎంపీ కితాబులు ఇచ్చారు. జిల్లా మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, అధికార యంత్రాంగం, ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలతో కలసి ముప్పాళ్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేసిన ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ "పీ4 బి జీరో ప్రాపర్టీ"గురించి సుదీర్ఘంగా వివరించారు. దేశంలో ఏ వ్యక్తి కూడా పేదరికంతో ఉండకూడదని లక్ష్యంతో 20% ఉన్న పేదలను 10 శాతం ఉన్న ధనికులు దత్తత తీసుకొని వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా పి ఫోర్ ను రూపకల్పన చేయడం జరిగిందని చంద్రబాబు తెలిపారు. అనంతరం గ్రామంలో 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కింద ఎంపికైన వారిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏపీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అందరి ఆలోచనా విధానంలో మార్పు రావాలని సీఎం చంద్రబాబు సూచించారు. సమాజంలో అందరికీ అవకాశాలు కల్పించాలని సీఎం చంద్రబాబు అన్నారు. మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడాలని చెప్పారు. పీ4లో భాగంగా 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కింద.. ఏపీలో 20 లక్షల కుటుంబాలను ఎంపిక చేశామని ప్రకటించారు.దేశంలో ఉన్న ఏ వ్యక్తీ పేదరికంలో ఉండకూడదని అన్నారు. దేశంలోనే ఎక్కువ పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. దీపం-2 కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. 30 ఏళ్ల క్రితమే మహిళల కోసం డ్రాక్రా సంఘాలు తీసుకొచ్చానని గుర్తుచేశారు. ఆర్థికంగా పైకి ఎదిగిన వారు.. ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయపడాలని పిలుపునిచ్చారు. అందరికీ సమాన అవకాశాల కోసమే పీ4 విధానమని స్పష్టంచేశారు. గతంలో పీ3 విధానం వల్ల రోడ్లను బాగుచేసుకున్నామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి పోయిందని ఆరోపించారు. తమది మానవతా దృక్పథంతో పనిచేసే ప్రభుత్వమని ఉద్ఘాటించారు. అట్టడుగున ఉన్నవారికి చేయూత అందించాలని సీఎం చంద్రబాబు చెప్పారు.ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అందజేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. జనాభా పెరుగుదల అత్యంత ముఖ్యమని చెప్పారు. దేశంలో ఉన్న ఏ వ్యక్తీ పేదరికంలో ఉండకూడదని తెలిపారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. దేశంలో రెండోతరం సంస్కరణలకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందని చెప్పారు. నాయకుడు దూరదృష్టితో ఆలోచిస్తేనే సమాజం బాగుపడుతుందన్నారు. ఏపీలో సంపద సృష్టించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సంపద సృష్టించి పేదలకు పంచుతామని అన్నారు. అందరి భవిష్యత్ బాగు కోసమే తమ ఆలోచన అని తెలిపారు. పిల్లలను బాగా చదివిస్తేనే ప్రపంచాన్ని ఏలుతారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.అందరి భవిష్యత్ బాగు కోసమే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు తెలిపారు. పిల్లలను బాగా చదివిస్తేనే ప్రపంచాన్ని ఏలుతారని అన్నారు. అప్పట్లో కుటుంబ నియంత్రణ పాటించమన్నామని గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో జనాభా పెరుగుదల అవసరమని తెలిపారు. లేకుంటే భవిష్యత్‌లో వృద్ధుల సంఖ్య పెరిగిపోతుందని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇదే సమస్యగా మారిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చివరగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నందిగామ నియోజవర్గం తో పాటు ముప్పాళ్ళ గ్రామానికి వరాలు జల్లు కురిపించారు. గ్రామంలో అన్ని రోడ్లు సిసి రోడ్లుగా మలచాలని, వీధి దీపాల నిర్వహణ,అదేవిధంగా గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావాలని కలెక్టర్ ను వేదికపై ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.ముప్పాళ్ళ గ్రామాభివృద్ధికి సమగ్రమైన అంచనాలను తయారు చేసి వెంటనే తెలియజేసినట్లయితే నిధులను వెంటనే విడుదల చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి సభ వేదికపై హామీ ఇచ్చారు. ప్రతి జంట ఇద్దరుకు మించి పిల్లలను కనాలని సభాముఖంగా ముఖ్యమంత్రి కోరారు.




## స్ఫూర్తివంతమైన సేవలందిస్తున్న ఐవీఎం

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో స్ఫూర్తివంతమైన సేవలందిస్తున్న సేవాసంస్థ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ అని అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు డా.మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పురిటిగడ్డ ఐవీఎం హోమ్లో వక్కలగడ్డ కమలానెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న 30 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐవీఎం సేవాసంస్థ ద్వారా సురేష్.. రోజా దంపతులు పేదలకు గొప్పసేవలందిస్తున్నారని కొనియాడారు. దివిసీమ ఉప్పెన తర్వాత ఏడాదిలో పునర్నిర్మాణం జరిగిందంటే అందుకు స్వచ్ఛంధ సేవాసంస్థలే కారణమనీ, సమాజంలో స్వచ్ఛంధ సేవాసంస్థల పాత్ర ప్రధానమన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఏ విపత్తు వచ్చినా, ఏ సమయంలోనైనా సేవలందించే సంస్థ ఐవీఎం అని ప్రశంసించారు. కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు నూతన ట్రెండ్స్కు అనుగుణంగా మెళకువలు నేర్చుకుని స్వయం ఉపాధిని పెంపొందించుకుని, ఆర్థికంగా స్థితివంతులు కావాలని ఆకాంక్షించారు. వక్కలగడ్డ కమలానెహ్రూ మహిళా మండలి స్థాపించిన నాటి నుంచీ నేటివరకూ మహిళాభ్యున్నతికి చురుకైన పాత్ర పోషిస్తోందన్నారు.ఐవీఎం డైరెక్టర్లు వేములపల్లి సురేష్ రోజా దంపతులు మాట్లాడుతూ, 2006లో ఐవీఎం ఆధ్వర్యంలో కుట్టుశిక్షణా శిబిరాలు నిర్వహించటం ప్రారంభించి అనేక బ్యాచ్లకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేశామన్నారు. గ్రామాల్లో పేద మహిళల జీవనోపాధికి, స్వయం ఉపాధి లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కమలానెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో 30 మందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వగా, వారికి ఐవీఎం ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.ఐవీఎం డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, రైతుసంఘం నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా మండలి అధ్యక్షురాలు హనుమానుల రాణీకుమారి, మల్లుపెద్ది రత్నకుమారి, ట్రస్ట్ ప్రతినిధులు నాదెళ్ల ఫణి, విజయ, స్వితిన్, సోఫి తదితరులు పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన సీఐ సమయస్ఫూర్తి

### వాటర్ ట్యాంకు ఎక్కిన మహిళను కాపాడిన వైనం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కుటుంబ సమస్యలు, మానసిక ఆందోళనలతో ఉన్న మహిళ వాటర్ ట్యాంకు ఎక్కి దూకేందుకు ప్రయత్నించగా స్థానిక యువత సహాయంతో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సమయస్ఫూర్తిగా వ్యవహరించి మహిళ ప్రాణాలు కాపాడారు. స్థానిక నారాయణరావునగర్ లో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన కొద్దిసేపు ప్రజలందరికీ హైటెన్షన్ను కలిగించింది. స్థానికంగా పుట్టింటి వద్ద ఉన్న ఓ ముస్లిం మహిళ మధ్యాహ్నం సమయంలో కాలనీలోని వాటర్ ట్యాంకు ఎక్కి ఏడుస్తూ ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఇరుగుపొరుగు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. స్థానికంగా ఉన్న చెంబురెడ్డి మణి, తుళ్లూరు విష్ణుభరత్ తదితర యువకులు ట్యాంకు ఎక్కి మహిళకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించినా ఆమె రాలేదు. ఇంతలో తండ్రి వచ్చి రావాలని కోరినా రాలేదు. సమాచారం అందుకున్న సీఐ ఈశ్వరరావు అక్కడకు చేరుకున్న వెంటనే మరో ఆలోచన చేయకుండా ట్యాంకు ఎక్కి సమస్యలుంటే తనకు చెప్పాలంటూ ఆమెను మాటల్లో పెట్టారు. అయినప్పటికీ ట్యాంకు అంచుకల్లా వెళ్లిన మహిళ అక్కడే కాళ్లు కిందకు వేలాడేసి కూర్చుండిపోయింది. భర్త ఫోన్ నెంబరు చెబితే ఫోన్ చేస్తామంటూ అక్కడే ఉన్న మణి అనే యువకుడికి డైరక్షన్ ఇవ్వటంతో మణి చాకచక్యంగా ట్యాంకు చుట్టూ తిరిగివెళ్లి మహిళను గట్టిగా పట్టుకుని వెనక్కులాగేశాడు. దీంతో ట్యాంకు పైకివెళ్లిన వారంతా ఇవతలకు తీసుకురాగా, సీఐ ఈశ్వరరావు చేయిపట్టుకుని జాగ్రత్తగా కిందకు దింపి తండ్రికి అప్పగించారు. ధైర్యంగా ముందుకువచ్చిన యువకుడు మణిని సీఐ ఈశ్వరరావు, ఎస్ఐఐ సుబ్రహ్మణ్యంలు అభినందించారు. సీఐ ఈశ్వరరావు సమయస్ఫూర్తిగా మహిళను కాపాడటంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మహిళ కిందపడితే ప్రమాదం జరగకుండా ఉండేలా స్థానికులందరూ కలిసి పెద్దపరజాలను పట్టుకోగా, సన్షైడ్ మాదిరిగా ఉన్న శ్లాబ్ భాగంలోని ఇనుప సువ్వలను వంచి అప్రమత్తంగా ఉన్నారు. అదృష్టవశాత్తూ ట్యాంకు నుంచీ మహిళను సురక్షితంగా కిందకు తీసుకువచ్చారు.

## ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వ భరోసా

### విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందించిన ముఖ్యమంత్రి

**నందిగామ/ ముప్పాళ్ళ ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నియోజవర్గం లోని చందర్లపాడు మండలం, ముప్పాళ్లలో శనివారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమం సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, విభిన్న ప్రతిభావంతుల శాఖ తదితర శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించారు.ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన సెర్ప్-ఉన్నతి వడ్డీలేని రుణాల మంజూరుకు సంబంధించిన స్టాల్‌ను సందర్శించి మహిళలతో మాట్లాడారు.మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా వివిధ కేటగిరీలకు చెందిన పదిమంది లబ్ధిదారులకు రూ. 3,40,200 విలువైన ఉపకరణాలు అందించారు. ఒక్కో ట్రైసైకిల్ రూ. 60 వేలు కాగా.. రూ. 1,80,000 విలువైన మూడు బ్యాటరీ ట్రైసైకిళ్లను లబ్ధిదారులకు అందజే శారు. డిగ్రీ కోర్సులు చేస్తున్న నలుగురు విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కటి రూ.35 వేలు విలువైన ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. ఒక్కొక్కటి రూ. 8,500 విలువైన రెండు వీల్‌ఛైర్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా రూ. 3,200 విలువైన వినికిడి యంత్రాన్ని లబ్ధిదారునికి అందించారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీరామనవమి కల్యాణోత్సవాలు

**పామర్రు ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని ఉండ్రపూడి - పోలవరం అడ్డరోడ్డు వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం లో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏకాహం(భజన కార్యక్రమం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండ్రపూడి గ్రామానికి చెందిన శ్రీ సీతారామాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో మండపాక అంజనాదేవి సారధ్యంలో భక్త బృందం భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కృష్ణ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరు పల్లి గణేష్, జనసేన పార్టీ పామర్రు నియోజవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, దాడి పవన్ కుమార్, కూనపరెడ్డి సుబ్బారావు, ఈడే గంటేశ్వరరావు లతోపాటు కార్యనిర్వహణాధికారి పివిఎన్వి ప్రసాదరావు వారికి స్వాగతం పలికి, పూజల అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద జరుగుతున్న ఏకాహం కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొని భజన చేస్తున్న భక్తులను అభినందించారు.

# స్వర్గీయ డాక్టర్ బాబు జగజీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలి





**విజయవాడ, మేజర్ న్యూస్ :** స్వర్గీయ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ 118 వ జయంతి సందర్భంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలం స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దపాటి ప్రసాద్ మాదిగ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోకన్వీనర్లు మానికొండ శ్రీధర్ మాదిగ, వైయస్ రాజు మాదిగ, స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొని బాబూజీ కు ఘన నివాళులర్పించారు. ఆశకు కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ మాట్లాడుతూ ఈ భారతదేశాన్ని అప్పటిలోనే ఆధునికంగా ముందుకు తీసుకెళ్లిన వ్యక్తి, 1935 లోనే దళితులకు ఓటు హక్కు కావాలని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడిన వ్యక్తి బాబూజీ 1946లో తాత్కాలిక ప్రధాని నెహ్రూ మంత్రివర్గంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు స్వాతంత్రం వచ్చిన తరువాత 1947లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పుడు కూడా కేంద్ర మంత్రిగా అతి చిన్న వయస్సు గల వ్యక్తిగా ఉన్నారన్నారు. అదే విధంగా 1946 నుండి 1980 వరకు ఏకధాటిగా పార్లమెంట్ సభ్యునిగా సాగిన చరిత్ర బాబుది తెలియజేస్తూ, బాబుజి ఆశయాలు కనుగుణంగా మనము కూడా పనిచేయాలని అన్నారు. దేశానికి సేవలు చేసిన మహోన్నతుడు డాక్టర్ బాబుజికి భారతరత్న కు నిజమైన వ్యక్తి కనుక మన రాష్ట్రంలో ఉన్న ఇప్పటి కూటమి ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో శాసనమండలిలో ప్రతిపాదన పెట్టి ఆమోదం ద్వారా పార్లమెంటుకు పంపి కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మనోహర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ, విధి మధ్య జరిగే సంఘర్షణ 'దీర్ఘసుమంగళీభవ'

### ఏప్రిల్ 7న ప్రారంభం, సోమవారం నుంచి శనివారం మధ్యాహ్నం 1గంటలకు మీ జీ తెలుగులో!




**విజయవాడ, ఏప్రిల్ 5, మేజర్ న్యూస్ :** ఆసక్తికరమైన మలుపులు, అదిరిపోయే ట్విస్టలతో సాగే సీరియల్ను అందిస్తున్న జీ తెలుగు మరో ఆసక్తికరమైన అంశంతో సాగే సీరియల్ను అందించేందుకు సిద్ధమైంది. ఆకట్టుకునే కథ, కథనం ప్రేక్షకులను అలరించేందుకు జీ తెలుగు అందిస్తున్న సరికొత్త సీరియల్ 'దీర్ఘసుమంగళీభవ'. అమ్మమ్మ అమర్నాథ్ యాత్ర కలను సాకారం చేసేందుకు అహల్య చేసే ప్రయత్నం, విధికి బలైన అహల్య, ఇంద్ర జీవితాలతో ఈ కథ ముడిపడి ఉంటుంది. బంధాలు, బంధుత్వాల మధ్య ఉద్వేగభరితంగా సాగే సీరియల్'దీర్ఘసుమంగళీభవ' ఏప్రిల్ 7న ప్రారంభం, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 1 గంటలకు, మీ జీ తెలుగులో మాత్రమే! అహల్య (మహీ గౌతమి) టైలర్గా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న తన అమ్మమ్మను అమర్‌నాథ్ యాత్రకు తీసుకెళ్లాలని కలలు కంటుంది. అక్కడ ఇంద్ర (పవన్ రవీంద్ర) అనే సైనికుడితో ప్రేమలో పడుతుంది. అతను తన గతంతో పోరాడుతుంటాడు. ఇంద్ర మరణంతో వారి ప్రేమ విషాదకరంగా ముగుస్తుంది. ప్రేమ, విధికి మధ్య బంధీ అయిన అహల్య భవిష్యత్తు ఎలా ఉంటుంది? అహల్య జీవితం ఎలాంటి మలుపు తిరగబోతోంది? అనే విషయాలు తెలుసుకోవాలంటే ఈ సోమవారం జీ తెలుగులో ప్రారంభమయ్యే దీర్ఘసుమంగళీభవ సీరియల్ని తప్పకుండా చూడండి! ప్రతిభావంతులైన నటీనటులు, కుటుంబ నేపథ్యంతో సాగే కథాంశంతో వస్తున్న దీర్ఘసుమంగళీభవ జీ తెలుగు ప్రేక్షకులకు చక్కని అనుభూతినిస్తుందనడంలో సందేహం లేదు. ఈ సీరియల్లో మహీ గౌతమి, ప్రతాప్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, పవన్ రవీంద్ర, శ్రీలక్ష్మి, జాకీ, ఆశా రాణి, సుమిత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ షోలోని అద్భుతమైన తారాగణం తమ నటనా ప్రతిభతో అందరినీ ఆకట్టుకోనుంది, కథాంశం వీక్షకులను నిరంతరం ఆకర్షిస్తుంది. కొత్త సీరియల్ దీర్ఘసుమంగళీభవ ప్రారంభంతో జీ తెలుగు ఇతర సీరియల్స్ ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు జరగనున్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు ముక్కుపుడక సీరియల్ మధ్యాహ్నం 12 గంటలకు, సీతే రాముడి కట్నం సీరియల్ మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రసారం కానున్నాయి. జీ తెలుగు ప్రేక్షకులు దయచేసి ప్రసార సమయాల్లో మార్పుని గమనించగలరు! భావోద్వేగాల సమాహారంగా రూపొందుతున్న దీర్ఘసుమంగళీభవ.. ఏప్రిల్ 7 నుంచి సోమవారం - శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 1 గంటలకు, మీ జీ తెలుగులో.. తప్పక చూడండి!

# ఈఎస్ఐతో కార్మికులకు ఆరోగ్య రక్ష

### ప్రెస్‌క్లబ్ వైద్యశిబిరంలో సూపరింటెండెంట్ జ్యోతి



**విజయవాడ, ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** అన్ని అవాంతరాలలో కార్మికులకు పూర్తి రక్షణ కల్పించే ఏకైక బీమా పథకం ఈఎస్ఐ అనీ, గర్భస్థ శిశువు నుంచి మరణానంతరం వరకు కూడా ఈఎస్ఐ బీమాదారులకు లబ్ధి చేకూరుస్తుందని కార్మికరాజ్య బీమా (ఈఎస్ఐ) విజయవాడ గుణదల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వర్రా జ్యోతి తెలిపారు. ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్ సంయుక్త అధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు, నాన్-జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి జనరల్ మెడిసిన్, సర్జికల్, గైనకాలజీ, గుండె వైద్య విభాగాల నిపుణులు, రమేష్, కామినేని ఆసుపత్రికి చెందిన వారు, అమరావతి కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టరు జ్యోతి మాట్లాడుతూ, కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. ఇ.ఎస్.ఐ. వర్తించే సంస్థలో పనిచేసే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సంస్థలో చేరిన రోజునుండే వైద్య సౌకర్యం పొందేందుకు అర్హు లవుతారని, ఈ పథకం క్రింద బీమా కార్మికుడు, వారి కుటుంబ సభ్యులు పూర్తి వైద్య సహాయం పొందుతారని, అవసరాన్ని బట్టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కూడా వైద్య సేవలు కల్పిస్తారని వివరించారు. కార్మికులు పని చేస్తుండగా అస్వస్థతకు, ప్రమాదాలకుగురైనప్పుడు వారు చెల్లించిన చందాతో నిమిత్తం లేకుండా వైద్య సదుపాయం కల్పిస్తామని, ఈ సదుపాయాన్ని పొందేందుకు ఎటువంటి పరిమితిలేదన్నారు. ఈ పథకం క్రిందకు వచ్చే కార్మికులకు అన్ని రకాల అనారోగ్యాలకు, కాన్పులకు, గాయాలకు, వృత్తి సంబంధమైన వ్యాధులకు, ప్రసూతి, శస్త్ర చికిత్సతో సహా నిర్ధేశించిన రీతిలో వైద్య సౌకర్యం కల్పిస్తామని డాక్టరు జ్యోతి వివరించారు. ఈఎస్ఐ సేవలను కార్మికులందరూ వినియోగించుకోవాలని కోరారు. కొన్ని యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే సిబ్బంది అందరికీ ఈఎస్ఐ కార్డులు ఇవ్వడంలేదనీ, దాని వల్ల వారు ఈఎస్ఐ ప్రయోజనాలు పొందలేకపోతు న్నారని ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అర్హులైన కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలనీ, అప్పుడే పథకం లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పూజారి రాజేష్ మాట్లాడుతూ కార్మిక రాజ్య బీమా చట్టం క్రింద నమోదు అయిన కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య సౌకర్యం కల్పించటం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ పథకం క్రింద చెల్లించే చందా గోరంత, కార్మికునికి లభించే భద్రత కొండంత. నామమాత్రపు చందాతో బీమాదారు లకు వైద్యహితలాభంతో పాటు పలు నగదు హితలాభాలను, సామాజిక భద్రతను ఈ పథకం కల్పిస్తుందన్నారు. ఐజేయూ జాతీయ సమితి సభ్యులు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, కార్యదర్శి దాసరి నాగరాజు, ఈఎస్ఐ గుణదల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మోదుమూడి మురళీకృష్ణ, చిన్నపత్రిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘురాం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై 5% రిబేట్

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుపై ఐదు శాతం రిబేట్ అందుబాటులో ఉందని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందస్తుగా చెల్లించిన పౌరులకు ఈ రాయితీ వర్తించనుంది. శనివారం కమిషనర్ విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, 2025-26 సంవత్సరానికి సంబంధించి మొదటి, రెండవ అర్ధ సంవత్సరాల ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఏకమొత్తంలో చెల్లించినచో ఐదు శాతం రిబేట్ వర్తించనుందని తెలిపారు. ఈ అవకాశం ఏప్రిల్ 30, 2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పౌరులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ముందస్తుగా పన్నులు చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

## పశ్చిమ వైసీపీ కార్యాలయంలో.. ఘనంగా బాబు జగజీవన్ రామ్ జయంతి

### కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి



**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** స్థానిక బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ వైసిపి కార్యాలయం లో బాబు జగజీవన్ రామ్ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని బాబు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేసారు. అనంతరం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,



దుర్గ గుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్, డా బి ఆర్ అంబెద్కర్, జ్యోతిరావు పూలె ఆశయాలకు అనుగుణంగా వారి అడుగుజాడలలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నడుస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగిందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చి భస్మాసురుడి హస్తం లాగా మా నెత్తిన మేము చేయి పెట్టుకున్నామని గోడు వెలకక్కుతున్నారన్నారు. రానున్న రోజుల్లో జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపడతారని, బాబు జగజీవన్ రామ్ కళలు కన్నా స్వరాజ్యం తీసుకొచ్చే విధంగా జగన్ మోహన్ రెడ్డి పాలన సాగుతుందన్నారు. భారత దేశంలో 30 సంవత్సరాలు వివిధ శాఖలలో కేంద్ర మంత్రిగా పని చేసిన మహనీయులు బాబు జగజీవన్ రామ్ అని కొనియాడారు. నేటి యువత బాబు జగజీవన్ రామ్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలలోను, స్కూల్ లలోను బాబు జగజీవన్ రామ్ దేశానికీ అందించిన సేవల గురించి తెలియజేయాలన్నారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఉపకులపతి ఆచార్య కె రాంజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నీ కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ మర్యాద పూర్వకంగా కలిసారు. వెలగపూడి సచివాలయంలో ఆయనను కలిసి విశ్వవిద్యాలయం అభివృద్ధికి సంబంధించిన అంశాల పై చర్చించారు. భవిష్యతలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భముగా ఆయనకు పూల మొక్క అందించి సత్కరించారు.

# వాడవాడలా ఘనంగా జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**సమతా వాదానికి పునాది వేసిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్..**

**కలెక్టర్ డీ కే బాలాజీ, కొనకళ్ల నారాయణరావు**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమాజంలో సమతా వాదానికి పునాది వేసిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ అని, వారిని స్ఫూర్తిగా మంచి సమాజం నిర్మాణానికి అందరూ వారి అడుగుజాడల్లో నడవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నగరంలోని మల్కా పట్నం సమీకృత వసతి గృహంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ బీహార్ రాష్ట్రంలోని చందా గ్రామంలో జన్మించారన్నారు. మన దేశ చరిత్రలో అందరూ సమానంగా ఉండాలి అని పోరాటం చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తర్వాత సమున్నతస్థానంలో కనిపించే వ్యక్తి స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ బాబు జగజీవన్ రామ్ అని కొనియాడారు. ఆయన సమాధిని సమతాస్థల్ అని, ఆయన జయంతిని కొన్నిచోట్ల సమతా దివస్ గా పిలుస్తున్నారన్నారు. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే నేడు అణగారిన వర్గాలకు మంచి వసతి గృహాలు, రుణాలు, రిజర్వేషన్లు తదితర మంచి సౌకర్యాలు కల్పించబడ్డాయన్నారు. ఇటువంటి సౌకర్యాలు కల్పించడానికి ఆనాడు జగ్జీవన్ రామ్ వంటి మహానుభావులు ఎంతో కృషి చేశారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని దేశ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. స్టాండప్ ఇండియా కింద బ్యాంకు రుణాలు ఇస్తున్నారని శివ అనే వ్యక్తి సైకిల్లో స్టీల్ సామాన్లు పెట్టుకొని వీధిలో తిరిగేవాడిని, అతను ఇటీవల మల్లావల్లి పారిశ్రామిక వాడలో వంట పాత్రల తయారీ యూనిట్ను ఏర్పాటు చేసుకొని వృద్ధిలోకి వచ్చారని, మరలా రెండో యూనిట్ స్థాపించేందుకు సిద్ధంగా ఉన్నారని అటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని నిరాశ చెందకుండా జీవితంలో ఏమైనా సాధించాలనే పట్టుదలతో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ చదువు కోవాలని ఏ పనైనా చేయాలనే తపన ఉండాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకొని, సమాజంలోని రుగ్మతల పై పోరాటం చేసి రాజకీయాల్లో ప్రవేశించి ఎంతో గొప్ప ప్రజా సేవ చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా నిలిచారన్నారు. సంక్షేమ వసతి గృహం కులాల వారీగా విడగొట్టకుండా ఈ వసతి గృహం అన్ని కులాలు కలిపి సమీకృత వసతి గృహంగా ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో మాదిరిగా అన్ని కులాల వారు కలిసిమెలిసి చదువుకోవడం వలన స్నేహపూర్వక ఆహ్లాదకరమైన వాతావరణ నెలకొని మానసిక వికాసానికి తోడ్పడుతోందన్నారుశిథిలావస్థలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను బాగు చేయుటకు జిల్లా కలెక్టర్ 7 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తర్వాత జిల్లా కలెక్టర్ జిల్లాలోని వసతి గృహాలను పరిశీలించి అక్కడ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వసతి గృహాల మరమ్మతుల కోసం 7 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. అనంతరం కలెక్టర్ రాంజీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న వసతి గృహ విద్యార్థి సువర్తరాజుతో ముఖాముఖి మాట్లాడారు. పెద్దయ్యాక ఏం కావాలని అనుకుంటున్నావని కలెక్టర్ ఆ విద్యార్థిని ప్రశ్నించగా తాను డాక్టర్ కావాలని కోరుకుంటున్నానని చెప్పడంతో కలెక్టర్ అతన్ని అభినందిస్తూ బాగా ఇష్టపడి చదువుకొని లక్ష సాధనకు కృషి చేయాలన్నారుఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యుఓ సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి ఫణి ధూర్జటి, పర్యవేక్షకులు బాబురావు,వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.





**బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికిపూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన డీకే బాలాజీ, కొనకళ్ళ నారాయణ రావు**

శనివారం ఉదయం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా నగరంలోని మల్కా పట్నం లో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్ దేవలపల్లి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఎస్సీ సంఘాల నాయకులు మాచవరపు ఆదినారాయణ, కొడాలి శర్మ, డొక్కా జగన్మోహన్రావు, గంగ్రపు సీనయ్య,వంపుగడుపుల చౌదరి, పి కొండయ్య, గుమ్మడి విద్యాసాగర్, కొడాలి అజయ్ కుమార్ విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో...**



శనివారం ఉదయం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ సంఘాల నాయకులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కే చంద్రశేఖర రావు, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి డబ్ల్యు ఓ ఫణి ధూర్జటి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, ఎస్సీ సంఘాల నాయకులు మాచవరపు ఆదినారాయణ, కొడాలి శర్మ, డొక్కా జగన్ మోహన్ రావు, అరవింద్ కుమార్, లింగం దిలీప్, రత్నం పలువురు ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో..**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** బాబు జగ్జీవన్ రామ్ జీవితం ఆదర్శనీయమని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వీఎంసి అధికారులు, సిబ్బందితో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశసేవకుడిగా భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఆయన దళితుల హక్కుల కోసం జీవితాంతం పోరాడి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ భారత రాజకీయం, సమాజంలో మార్పులు తీసుకురావడంలో కీలక పాత్ర వహించారని, ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మేయర్ అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానంగా ఎదగాలన్నది ఆయన లక్ష్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ పీ సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.



**సామాజికన్యాయం కోసం పోరాడిన రాజకీయవేత్త బాబు జగజ్జీవన్ రామ్**

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి విజయ సారథి, మండల పరిషత్ పరిపాలన అధికారి ఎం డి ఇమ్రాన్ లు మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, అంగలూరు కార్యదర్శి ఎలీషారావు, గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ సిబ్బంది దుర్గారావు, శ్రీనివాసరావు, నాగరాజు, పవన్, వాసంతి, హర్షిత, సునీత, తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంలో ఘనంగా డా.బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ ఎనలేని సేవలు అందించారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. దివంగత మహనేత, పోరాట యోధులు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని ఇబ్రహీంపట్నంలో శనివారం ఘనంగా నిర్వహించారు ఇబ్రహీం పట్నం శక్తి నగర్ లో భీమరాజు గట్టు వద్ద దివంగత నేత డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ ఎస్సి సెల్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు గరికపాటి జయపాల్ నివాసంలో**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు గ్రామంలో భారత మాజీ ఉప ప్రధాని, మాజీమంత్రి స్వర్గీయ బాబు జగ్గజ్జీవన్ రామ్ 118. వ జయంతి సందర్భంగా జి.కొండూ రులో టీడీపీ ఎస్సి సెల్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు గరికపాటి జయపాల్ నివాసంలో జాగ్గజ్జీవన్ రామ్ చిత్ర పటానికి టీడీపీ నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి జయపాల్, గరిక పాటి స్వామిదాస్, చందా చిన్న నాగయ్య, బూర్సు శివ, ప్రత్తిపాటి ఆదాం, బేతపూడి చిన్న నరసయ్య, కోపూరి ఏడుకొండలు, కొండూరు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**కీర్తి రాయుని గూడెంలో ...**



మండలంలోని కీర్తి రాయుని గూడెం లో ఈరోజు బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి స్థానిక గ్రామస్తులతో కలిసి పూలమాలలు వేసి మైలవరం మాజీ జెడ్పిటిసి సభ్యులు దొండపాటి రాము నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొండపాటి విజయ్ కుమార్, మట్టకొయ్య సుందరం,గద్దల సుబ్బారావు, శీలం సౌలు రాజ్, మల్లాది దాసు, శీలం మహేష్, కృష్ణ కాంత్, పచ్చిగళ్ళ రాజేశ్వరరావు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**



కొండపల్లి మునిసిపాలిటీ పార్టీ కార్యాలయంలో " బాబు జగ్జీవన్రామ్ 117 వ జయంతి" వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయినా బొర్రా కిరణ్, పీసీసీ కార్యదరిశి పోతురాజు ఏసు దాస్ తదితరుల నాయకులు పాల్గొని వారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ కార్యదరిశి పోతురాజు ఏసు దాస్,అక్కల నాగేంద్ర ప్రసాద్, రాగాల రాము,చెరుకుఆనందరావు,పోతురాజు థామస్పాల్, యలమంచిలి కోటేశ్వరరావు, ఉప్పుతల శ్రీను కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**టీడీపీ మండల కార్యాలయంలో...**



జి కొండూరు గ్రామంలో టిడిపి మండల పార్టీ కార్యాలయంలో నాయకులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. జోహార్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షు ప్రధాన కార్యదర్శి లు పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ వరప్రసాద్, సీనియర్ నాయకులు ఉయ్యూరు నరసింహ రావు, చందా చిన్న నాగయ్య, గరికపాటి జైపాల్, దోప్పల బుజ్జి బాబు,పచ్చిగోళ్ళ బాలకృష్ణ, బూర్సు శివ, నక్కన బోయిన జగదీష్, గాలి శ్రీను, కలేకూరి రవి,నూతక్కి సునీల్, పజూరు విజయకుమార్ బేతపూడి చిన్న నరసయ్య, మేచారపు వెంకటరావు,బద్రి వెంకటేశ్వరరావు,బోడె జయరాజ్, బాదినేని సీతారామరాజు,గురువింద పల్లి బాలరాజు, కొడాలి జోజి, చీళ్ళ రమేష్,నూ తక్కి విజయ్, నిమ్మకూరు రామస్వామి, బట్టు రాయప్ప,ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఘంటసాల మండలం లంకపల్లి ఇందిరాకాలనీలో..**



**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఘంటసాల మండలం లంకపల్లి ఇందిరా కాలనీలో విగ్రహ దాత మాజీ ఎంపీటీసీ సభ్యుడు నలుకుర్తి సురేష్ రూ. లక్ష ఆర్థిక సహకారంతో, గ్రామస్తులు సహకారంతో, శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని గ్రామస్తులు, ప్రముఖులతో కలిసి సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాబూ జగజీవన్ రామ్ కమిటీ సభ్యులు నలుకుర్తి సుప్రవర్ద్,కొల్లారి నరేష్ పెనుమాక రత్నగిరి, కుంపటి అరుణ్ కుమార్, దిరిశం సుధీర్, నడకుదురు జనుష్, కొల్లూరి జేమ్స్, ఇసుకపల్లి విక్కీ గురందపల్లి రమేష్,కొడాలి సురేష్, బుర్రె నరేష్,కుంపటి పరంజ్యోతి,ఉడుముల సాకేత్, గుండుపల్లి నాగరాజు, పెనుమాక బాబు, తదితరులు పాల్గొన్నారు.

**బీజేఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**



**పామర్రు ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** పామర్రు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద డాక్టర్ బాబు జగజీవన్ రామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జగజ్జీవన్ రావు దళిత జాతికి చేసిన సేవలను కొనియాడారు. రాయవరపు వెంకటేశ్వరరావు అధ్యక్షులు జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఎమ్ఇఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొకినాల కృష్ణ, సంక్షేమ సంఘం కన్వీనర్ కాంద్రు ఏసురత్నం, నాయకులు జవ్వనపుడి భాస్కరరావు, గూడవల్లి దామోదర్ రావు, కలపాల నాని, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాయవరపు రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ దేవరపల్లి రామకోటేశ్వరరావు, రిటైర్డ్ రైల్వే ఇంజనీర్ జవ్వనపూడి అంజయ్య, రిటైర్డ్ సిఐ రాయవరపు చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**పామర్రు మండల పరిధిలో..**



జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం ఆయన పామర్రు మండల పరిధిలోని చాట్లవానిపురం, బలిపర్రు, పెదమద్దాలి గ్రామాలలో జరిగిన వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యేతో పాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు చాట్ల రమేష్, జిల్లా మహిళా అధికార ప్రతినిధి మైనేని ఇందిర లతోపాటు ఆయా గ్రామాల్లోని స్థానిక దళిత నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...**



**పామర్రు ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** పామర్రులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మాజీ ఉప ప్రధాని బాబు జగజీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక చాట్లవానిపురంలో గల బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి కైలే అనిల్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పామర్రు మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పమిడిముక్కలలో...**



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** జగజ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను పమిడిముక్కల మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని గోపాల కృష్ణ పురం గ్రామం, హనుమంతపురం గ్రామంలో సిబిసిఎన్ సి చర్చి సెంటర్లో, మేడూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందిమళ్ళ పూర్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు మర్రీ దుర్గారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అమిరెడ్డి శివరామకృష్ణ, మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, రెవరెండ్ కొల్లూరు సుధాకర్, కందిమళ్ళ సుబ్రహ్మణ్యం, బాబు జగజీవన్ రామ్ యూత్ సభ్యులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**పెదపారుపూడి మండలంలో..**



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను శనివారం పెదపారుపూడి మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా వేడుకలలో స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. మండల పరిధిలోని జువ్వనపూడి, వెంట్రప్రగడ, పులవర్తివాని గూడెం, యలమర్రు గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. యలమర్రు గ్రామంలో ముందుగా జగజ్జీవన్ రామ్ విగ్రహానికి జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ తో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసినివాళులర్పించారు.

**మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ : జిల్లా ఎస్పీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా, శనివారం జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు. ఇతర పోలీసు అధికారులతో కలిసి, జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





**గుడ్లవల్లేరు వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో**

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** డాక్టర్ బాబూ జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా గుడ్లవల్లేరు మండలం, గుడ్లవల్లేరు గ్రామం అంబేద్కర్ నగర్ లోని జగజ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎ స్సార్ పార్టీ నాయకులు పూలమాలు వేసి, నివాళులర్పించి, అందరికీ మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోటప్రోలు నాగు, వైఎస్సార్సీపీ మండల యూత్ అధ్యక్షులు గుదే రవి, వైఎస్సార్సీపీ శ్రేణులు కుందేటి ఫణి, కాటూరి వినోద్, మేకల అనిల్, ధరావత్ వెంకటేశ్వరనాయక్, కొడాలి రవితేజ, అటుమిల్లి రజనీకాంత్, కుందేటి నవీన్, బాబి, కుందేటి అభిలాష్, చేదుర్తిపాటి జయంత్, కాటూరి మధుబాబు,, గ్రామస్తులు పాల్గొన్నారు.

**యమ్ ఈ యఫ్ గన్నవరం అధ్యక్షులు దేవరపల్లి యేసు బాబు ఆధ్వర్యంలో..**



**గన్నవరం, ఏప్రిల్ 5, మేజర్ న్యూస్ :** డాక్టర్.బాబు జాగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా గన్నవరం లో యమ్ ఈ యఫ్ గన్నవరం అధ్యక్షులు దేవరపల్లి యేసు బాబు ఆధ్వర్యంలో జాగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గన్నవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, నాగేశ్వరావు పాల్గొనిజాగ్జీవన్ రామ్విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో నిడమర్తి నాగేశ్వరావు, పొలిమేట్ల జయరాజు, అడ్వాకేట్ తిరివీధి వెంకయ్య, హై కోర్ట్ అడ్వాకేట్ విజయసారధి, యమ్ ఈ యఫ్ జిల్లా నాయకుడు దేవరపల్లి విక్టర్ బాబు, బోకినాల కోటేశ్వరరావు,దేవరపల్లి జయరాజు, రిటైడ్ టీచర్ దేవ సుందరం, రాచేటి మురళి, దేవర పల్లి రాబర్ట్ జాన్సన్, కలపాల వికాస్, యమండ అభినేష్, పాగోలు ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**తెలుగుదేశం కమ్మంపాడు గ్రామ అధ్యక్షులు బీమాల నాగేశ్వరావు ఆధ్వర్యంలో**



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** ఏ కొండూరు మండలం కమ్మంపాడు గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీమాల నాగేశ్వరావు ఆధ్వర్యంలో డా.బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎ.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి తోపాటు నాయకులుకలిసి డా.బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో మండలంలో వివిద హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

**దివిసీమ దివ్య సీమగా రూపొందడంలో**

**బాబూ జగజ్జీవన్ రామ్ పాత్ర మరువలేనిది: ఎమ్మెల్యే మండలి**



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** 1977 ఉప్పెనకు అతలాకుతలమైన దివిసీమ దివ్య సీమగా రూపొందటంలో బాబూ జగజ్జీవన్ రామ్ పాత్రను మరువలేమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక నేరెళ్లపాలెం బస్టాప్ సెంటరులో భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, తెలుగుదేశం పార్టీనియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు బొబ్బా గోవర్ధన్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన టౌన్ అధ్యక్షులు రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాధ్ ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు కర్రా సుధాకర్,పాల్గొన్నారు.



## గ్రామాలలో అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యం

**పామర్రు ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పామర్రు లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శనివారం ప్రారంభించారు. గ్రామంలోని ఆంధ్ర బ్యాంకు నుండి శివాలయం వరకు జిల్లా సీనరేజి నిధులు 20 లక్షల అంచనాతో నిర్మించిన సిసి రోడ్డును ముందుగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అన్ని రహదారులను పూర్తిగా సిసి రోడ్లుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, అందుకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు. పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కరకట్ట వలన వందల ఎకరాల పొలానికి ఉప్పునీటి సమస్య తగ్గుతుంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మండలం లోని కానూరు పంచాయతీలో కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజి మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ లజ్జ బండ డ్రైన్ కు సంబంధించి వేయిచున్న,కరకట్ట పనులను పరిశీలించగా అక్కడ 425 ఉపాధి హామీ కూలీలను గమనించారు అలాగే వారు చేస్తున్నటువంటి పనులకు సంబంధించిన మాస్టర్లను పరిశీలించారు.తదనంతరం ఆయన మాట్లాడుతూ కరకట్ట వలన వందల ఎకరాల పొలానికి ఉప్పునీటి సమస్య తగ్గుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పేతా రాము,బొమ్మిడి ఏడుకొండలు,గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, బొమ్మిడి చిన్న ఏడుకొండలు మొదలగువారు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్య సేవలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు ఆధ్వర్యంలో గుడ్డవల్లేరులోని జన్మభూమి మెడికల్ సెంటరులో శనివారం వందలాది మంది రోగులకు వివిధ రుగ్మతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు సెయింట్ జోసెఫ్ డెంటల్ వైద్యులు రోగులకు దంత వైద్య పరీక్షలు చేశారు. విజయవాడ సివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు రోగులకు గుండె పరీక్షలు చేశారు. మచిలీపట్నం నాగమణి రెటీనా ఇన్స్టిట్యూట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పవన్ కుమార్ గొరిపర్తి వైద్య బృందంచే నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్ళజోళకు సిఫారసు చేశారు. అవసరమైన రోగులకు ఉచిత మందులు పంపిణీ చేపట్టారు. అలాగే ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్ వారు, హోమియో వైద్యులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు తమ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారని డాక్టర్ సి ఎల్ వెంకటరావు పేర్కొన్నారు.

## ఈనెల 15 వరకు సెక్షన్ 30 అమల్లో ఉంది



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 15వ తేదీ వరకు సెక్షన్ 30 అమల్లో ఉందని ఏ విధమైన సభలు సమావేశాలు నిర్వహించకూడదని డిఎస్పి శ్రీవిద్య చెప్పారు. శనివారం ఆమె డి.ఎస్.పి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సెక్షన్ 30 అమల్లో ఉన్న కారణంగా ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా సభలు గానీ ర్యాలీలు గాని సమావేశాలు కానీ నిర్వహించడం నిషేధం అన్నారు. ఎవరైనా సమావేశాలు నిర్వహించుకోవాలనుకున్న ఎడల తప్పనిసరిగా డి.ఎస్.పి అనుమతి తీసుకోవాలన్నారు. పోలీసువారి ఆదేశాలను మీరి చట్టవులంగనకు పాల్పడితే అటువంటి వారి ఎంతటి వారినైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహేశ్వరి దేవి

### మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు



**గన్నవరం, ఏప్రిల్ 5, మేజర్ న్యూస్ :** అంకిత భావంతో పనిచేయడం ద్వారా ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వారిలోమహేశ్వరి దేవి ఒకరిని చెప్పడంలో అతిశయోక్తి లేదని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు.ఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్ గా పని చేస్తూ ఉద్యోగ విరమణ సందర్భంగా గన్నవరం రాయ నగర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినయు. మహేశ్వరి దేవి అభినందన కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. అభినందన సభకు మాజీ ఎమ్మెల్సీ బి. నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణ రావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, యుటిఎఫ్ కోశాధికారి మరీదు వరప్రసాద్, ఉంగుటూరు ఎంఈఓ సాంబశివరావు, బాలోత్సవం నాయకులు గన్నె వెంకట్రావు, కర్రా వరప్రసాద్, సామాజిక వేత్త డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల హెచ్.ఎం.ఝాన్సీ లక్ష్మి, ఆత్కూరు జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం కెవిబికే. సుధాకర్, పిల్లల తల్లిదండ్రులు, మహిళా ఉపాధ్యాయులు మహేశ్వరి దేవి దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మెమొంటోతో సత్కరించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ.... ప్రస్తుతం ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లల తల్లిదండ్రుల పైన, ఉపాధ్యాయుల పైన ఉందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. వారి సమస్యలను పరిష్కరించడంలో ఇంకా సాచివేత ధోరణి సాగుతుందన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలో సుదీర్ఘకాలం పాటు పనిచేసే పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దినమహేశ్వరి దేవి లాంటి టీచర్లు ఈ సమాజానికి కావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీబొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, విద్య అందరికీ అందాలని తపించి, పాఠశాలలో పిల్లలను పవిత్రంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేసిన మహేశ్వరి దేవికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో గుడివాడ డివైఈవోకె రవికుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్, జిల్లా అధ్యక్షులు యం.డి షౌకత్ హుస్సేన్, జిల్లా గౌరవాధ్యక్షులుజె. లెనిన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కనకారావు, యుటిఎఫ్ నాయకులుపి. ప్రసాదరావు, యం.రాజు, టి. రంగారావు, జి.రాజబాబు, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు. గొల్లనపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం జగదీశ్వరరావు కార్యక్రమ అనుసంధాన కర్తగా వ్యవహరించారు.

# జాతీయ విద్యావిధానంతో ఎంతో పురోగతి సాధించవచ్చు








**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ 27వ వార్షికోత్సవ వేడుకలు నేటి సాయంత్రం జరిగాయి. కృష్ణా విశ్వ విద్యాలయం, మచిలీపట్నం ఉపకులపతి ప్రొఫెసర్ రాంజీ కూన ముఖ్య అతిథి గా విచ్చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బుర్రా కరుణ కుమార్ అధ్యక్షత వహించి ప్రారంభోపన్యాసం చేసి, కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. అకడమిక్ టాపర్గా నిలిచిన సి.ఎస్.ఇ విభాగం విద్యార్థిని కొమ్ము సుప్రియా కళాశాలలో తమకు కలిగిన ఆనందానుభూతులను, అనుభవాలను వివరించారు. నాలుగు సంవత్సరాల విద్యార్జనలో తోడ్పాటు అందించిన అధ్యాపకులకు, అందుకు అనుగుణముగా తగిన వసతులు కల్పించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిధి ప్రొఫెసర్ రాంజీ కూన ఉపన్యసిస్తూ 25 సం.ల చరిత్ర కలిగిన శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసించడం ఒక అదృష్టమని అన్నారు. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఆశయాలకు అనుగుణముగా శతవసంతాల భారత పురోగతి నేటి యువత పైన ఉన్నదని, అందుకొరకు వికసిత భారత్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ విద్యా విధానం 2020 అమలు చేయడం ద్వారా ఎంతో పురోగతి సాధించవచ్చునని ప్రొఫెసర్ రాంజీ అభిప్రాయపడ్డారు. ఈ.సి.ఇ విభాగానికి చెందిన కమ్మెల సాయి సంజన కస్తూరి కి బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్ గా వల్లభనేని కృష్ణ కుటుంబరావు స్మారక బంగారు పతక పురస్కారాన్ని, నగదు బహుమతి, సర్టిఫికెట్ లను, ఈ.సి.ఇ విభాగానికి చెందిన కమ్మెల సాయి సంజన కస్తూరి కి బెస్ట్ ఔట్ గోయింగ్ లేడి స్టూడెంట్ గా ప్రొఫెసర్ కోనేరు వెంకట రాజేశ్వర రావు %డ% ఎం.ఎల్.ప్రసూనాంబ బంగారు పతక పురస్కారాన్ని, నగదు బహుమతి, సర్టిఫికెట్ లను, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు విభాగాల వారీగా దాతలు అందించిన బంగారు పతక పురస్కారాలు ముఖ్య అతిథి రాంజీ చేతుల మీదుగా అందచేసారు.9 విభాగాలకు బెస్ట్ ప్రాజెక్ట్స్ కి ఒక్కొక్కరికి నగదు బహుమతులు విద్యార్థులు అందుకున్నారు. అదే విధంగా పి.హెచ్.డి. పట్టా పొందిన 13 మంది కళాశాల అధ్యాపకులను యాజమాన్యం నగదు బహుమతుల తో ప్రోత్సహించింది. అనంతరం ముఖ్య అతిధి ప్రొఫెసర్ రాంజీ కూన ను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సత్యనారాయణరావు వల్లూరుపల్లి,కో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రామకృష్ణ వల్లూరుపల్లి, ప్రమోటర్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని సుబ్బారావు, ఉపాధ్యక్షులు కె.వి.కృష్ణరావు తదితరులు పాల్గొని దుశ్శాలువ, పుష్ప గుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. కన్వీనర్ డా. బి.దాసు, ప్రొఫెసర్ ఆఫ్ ఇ.ఇ.ఇ. వందన సమర్పణ చేశారు. అనంతరం సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డా.రంగ బాబు ఆధ్వర్యంలో మానసిక ఉల్లాసానికి, ఉత్సాహానికి విద్యార్థులు, అధ్యాపకులచే పలు సంగీత, నృత్య, సాంస్కృతిక, సందేశాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు ఆలపించిన పాటలు, నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు, గీతాలాపన అబ్బుర పరిచాయి. కళాశాల ప్రాంగణం విద్యార్థుల కేరింతలతో, కోలాహలంగా మారింది.ఈ కార్యక్రమములో కళాశాల ఛైర్మన్, సెక్రెటరీ & కరస్పాండెంట్,కో సెక్రెటరీ & కరస్పాండెంట్, ప్రమోటర్ సొసైటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్స్, యాజమాన్య సలహాదారులు, డైరెక్టర్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తాను

### గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్



**నందివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్గా నియమితులైన నందివాడ మండలానికి చెందిన చాట్రగడ్డ రవికుమార్ శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మీడియాతో మాట్లాడుతూముందుగా గుడివాడ నియోజకవర్గ ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తూప్రతిష్టాత్మకమైన గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్గా నన్ను నియమించినందుకు సీఎం చంద్రబాబు కి, మంత్రి లోకేష్కి కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. నాపై నమ్మకంతో చైర్మన్గా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర్రావు, మద్దతు తెలిపిన జనసేన, బిజెపి, ముఖ్యంగా టిడిపి నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రజలకు మంచి చేయాలన్న కూటమి ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి కంకణం గట్టుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషిలో భాగస్వామ్యం అవుతూతెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు సాగుతూ, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా అందరితో కలిసి పని చేస్తూమార్కెట్ యార్డ్ చైర్మన్ గా బాధ్యతలు కృత నిశ్చయంతో నిర్వహిస్తానని తెలియజేశారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో ఆయన ఆదేశాల మేరకు రైతాంగ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడతానని మార్కెట్ యార్డు పరిధిలోని రైతాంగానికి హామీ ఇస్తున్నారన్నారు.

# ఉత్తమ విద్యతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** క్రమశిక్షణ కలిగిన ఉత్తమ విద్యతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, తెలుగు రాష్ట్రాలలో డిఎస్సి కోచింగ్ లో అవనిగడ్డ ప్రత్యేక స్థానాన్ని పొందిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో 29వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, పూర్వపు జిల్లా కలెక్టర్ బీ.లక్ష్మీకాంతం - శోభలత దంపతులు, యువనాయకులు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృషితో నాస్తి దుర్భిక్షం అన్నట్లు విద్యార్థులు నిరంతర కృషితో పురోగమించాలని పిలుపునిచ్చారు. ఒకనాటి ఫ్యాక్షన్ గ్రామాలకు నిలయమైన దివిసీమలో కేవలం ఉన్నత విద్య అభ్యసించిన వారి ద్వారానే శాంతి స్థాపించి భద్రతకు ప్రమాదం లేదనే భరోసా ఇవ్వటంతోనే ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి

**ఎమ్మెల్యే మండలి**

ఏటా వేలాది మంది అభ్యర్థులు డీఎస్సీ శిక్షణ పొందుతున్నారని తెలిపారు. పాఠశాల విద్యతో పాటు డీఎస్సీ శిక్షణ ద్వారా విద్యానికేతన్ విద్యాసంస్థ దివిసీమ విద్యా ప్రగతిలో కీలక భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ బీ.లక్ష్మీకాంతం మాట్లాడుతూ నైపుణ్యము లేని విద్య నిరుపయోగం అన్నారు. గుడికి వెళ్లేవాడు భక్తుడవుతాడని, బడికి వెళ్లేవాడు యుక్తుడవుతాడని, రెండింటికి వెళ్లేవాడు శక్తుడు అవుతాడన్నారు. డబ్బు సంపాదించుకుంటే దాన్ని కాపాడుకునేందుకు తపించాల్సి వస్తుందని, విద్యను సంపాదించుకుంటే అది మనల్ని కాపాడుతుందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్ప్రవర్తనకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. అనంతరం విద్యా, క్రీడా విషయక విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యానికేతన్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పీ.ఎన్.వీ లంకమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆర్.పార్థసారధి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నెధర్లాండ్ పీఐఈఈఎస్ డైరెక్టర్ రేపల్లె ప్రతాప్, ఎస్ వి ఎల్ క్రాంతి విద్యాసంస్థల అధినేత దుట్టా ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకులు మాదివాడ రాము, ఎంఈఓ అన్నపరెడ్డి పిచ్చియ్య, లలిత మనోహరి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్.వీ.కృష్ణారావు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నిరుపేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎంఎల్ఏ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు లు 49మంది లబ్ధిదారులకు రూ.21,65,837 సీఎంఆర్ఎఫ్ సహాయం చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు సత్వర సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదములు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం సమర్ధవంతంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆ పథకంలోకి రాని వైద్య సేవలకు కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మోపిదేవి మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాధ్ ప్రసాద్, నాయకులు గుడివాక శివరావు, బచ్చు శ్రీహరి తదితరులు పాల్గొంటున్నారు.



## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**అమరావతి మేజర్ న్యూస్ :** రాజకుల సమస్యలు పరిష్కరించడంలో రాజకీయ నాయకులు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని, మన సమస్యలు పరిష్కారానికి రాజకులందరూ ఏకం కావాలని తెలంగాణా రాష్ట్ర రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్పు భిక్షపతి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రజక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి హాజరైనారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ తరాలు మారినా తలరాతలు మారక ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా రజకుల పరిస్థితి అగమ్యగోచరంగా వుందని, అధికారంలోకి వచ్చేందుకు రాజకీయ నాయకులు పలు వాగ్దానాలు చేస్తున్నారని, అధికారం కైవసం చేసుకున్న తరువాత తెప్ప తగలేస్తున్నారని ఆరోపించారు. అలాగే అధికారుల నిర్లక్ష్యం వల్ల రజకుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి సామెతగా వుందని విమర్శించారు. విద్య, ఉద్యోగం, ఉపాది అవకాశాలు దక్కాలంటే పోరాటమే శరణ్యమని, రజకులను ఎస్.సి. జాబితాలో చేర్చాలని ఇందుకు ప్రభుత్వంపై ఉద్యమానికి శిద్ధంగా వుండాలని ఆయన రజక సోదరులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భిక్షపతిని రజక సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్. వెంకటయ్య, సి.మల్లేష్, యాకయ్య రణదీప్, కనకయ్య పాల్గొన్నారు.

# అంధకారంలో మండలి వారిధి

**మందుబాబులకు అడ్డాగా మారిన వైనం**

**సోలార్ ఆటో కట్ లైట్లు ఏర్పాటు చేయాలి**

**యువనేత గౌతమ్**



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఎన్నో ప్రజా ఉద్యమాలతో సాధించుకున్న పులిగడ్డ పెనుమూడి పై నిర్మించిన మండలి వారిది నేడు అంధకారంలో కునారిల్లుతుంది. ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల అనుసంధానంగా నిర్మించిన ఈ వారధి పై ఇప్పటికీ టోల్ గేట్ వసూలు చేస్తున్నవారు సోలార్ ఆటో కట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని యువనేత బడే గౌతం డిమాండ్ చేశారు. గౌతమ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ దివిసీమ ప్రాంతంలో మరో స్వాతంత్ర్య ఉద్యమాన్ని తలపించే రీతిలో సాగిన మహా ప్రజా ఉద్యమ ఫలితంగా అప్పటి ప్రభుత్వం దిగిరాగా నవయుగ కన్స్ట్రక్షన్స్ కంపెనీ వారిచే నిర్మింపబడి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి చే ప్రారంభింపబడిన పులిగడ్డ పెనుమూడి వారధికి స్వర్గీయ దివిసీమ గాంధీ మండలి వెంకటకృష్ణారావు వారధిగా నామకరణం జరిగిన విషయం అందరికీ తెలిసినదే అన్నారు. పులిగడ్డ పెనుమూడి వారధి వలన ఇటు మన ప్రాంతం పర్యాటకం గాను అటు గుంటూరు జిల్లా వ్యాపార పరంగాను అభివృద్ధి చెంది విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చిందని. అటువంటి ప్రాముఖ్యత కలిగిన వారధి నిత్యం వాహనాల రాక పోకలతో రద్దీగా ఉంటూ చీకటి పడితే మాత్రం వారధిపై విద్యుత్ లైట్లు లేక కొన్ని స్తంభాలకు ఉన్న లైట్లు సైతం వెలగక అంధకారంలో ఉండటం వలన కొన్ని చోట్ల మందు బాబులకు ఆవాసంగా మారింది. వారధిపై ప్రయాణించే పాదచారులు, సైకిలిస్టులు, తక్కువ లైటింగ్ తో ఉండే వాహన దారులు వారధిపై లైట్లు లేక చీకటిగా ఉండుటవలన తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనడమే కాక పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు పేరుతో ఉన్న పులిగడ్డ పెనుమూడి వారధి పై వెలుగులు నింపే నిమిత్తం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, రేపల్లె ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి అయినా అనగాని సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో మాట్లాడి వారిది పై సోలార్ ఆటో కట్ ఆఫ్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించే విధంగా కృషిచేసి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని గౌతమ్ కోరారు.

## నేటి నుండి లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లి, దివిసీమ ప్రజలకు కొంగు బంగారమైన అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆదివారం ఉదయం 11.45 నిమిషాలకు లంకమ్మ అమ్మవారిని ఆలయం నుండి బయటకు తీసుకువచ్చి గ్రామోత్సవానికి సిద్ధం చేస్తారని, తొలుత పుట్టింటి వారి ఇంటికి వెళ్లి పసుపు కుంకుమ అందుకొని గ్రామోత్సవానికి బయలుదేరుతుందన్నారు. 6వ తేదీ నుండి 11 తేదీ వరకు అమ్మవారిని గ్రామంలో ని వీధుల్లో ప్రతి ఇంటికి ఊరేగింపు నిర్వహిస్తారు 12వ తేదీ శనివారం 11 గంటల 48 నిమిషాలకు అమ్మవారు గుడికి చేరుకుంటుందన్నారు. అనంతరం గుడి సంబరం జరుగుతుందని చెప్పారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో జరిగే ఈ జాతర మహోత్సవంలో భక్తులు మొక్కుబడులు చెల్లించుకుని కానుకలను హుండీలో వేయాలని ఆయన కోరారు. అమ్మవారు ఊరేగింపుగా తమ తమ గృహాలకు వచ్చే సమయంలో పసుపు కుంకుమ పూలు పళ్ళు టెంకాయలు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారికి బిందెలతో వేపాకు,పసుపుతో కూడిన నీళ్లను వార పోసి మొక్కుబడి చెల్లించుకోవాలని తెలిపారు.

## అవనిగడ్డ - కోడూరు రహదారి పనులు పరిశీలన



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో కీలకమైన అవనిగడ్డ - కోడూరు రోడ్డు నిర్మాణం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో పునఃప్రారంభం అయినట్లు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ తెలిపారు. శనివారం సాయంత్రం అవనిగడ్డ మండలం రామచంద్రాపురం వద్ద ప్రధాన రహదారి నిర్మాణ పనులను మండలి వెంకట్రామ్ కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ శాఖ డీఈఈ ఎం.రమేష్ మాట్లాడుతూ మే నెలాఖరులోపు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వెంకట్రామ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు పునఃప్రారంభం అయిన అవనిగడ్డ - కోడూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, జనసేన పార్టీ కోడూరు మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్పర్సన్ ను సత్కరించిన చిలకలపూడి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఘంటసాల మార్కెట్ యాడ్ ఛైర్పర్సన్ గా నియమించబడిన తోట కనక దుర్గను రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ఘనంగా సత్కరించారు. శనివారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన పార్టీ వీర మహిళ కనకదుర్గ ను పాపారావుతో పాటు చిలకలపూడి నారాయణరావు అంద్రాజు శ్రీనివాసరావులు సత్కరించి రైతులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు అందించాలన్నారు.

## వెంకట్రావమ్మ ఇంటిలో కాఫీ తాగిన ముఖ్యమంత్రి



**నందిగామ/ముప్పాళ్ళ ఏప్రిల్ 5 మేజర్ న్యూస్ :** మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగజీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు “మార్గదర్శి - బంగారు కుటుంబం” కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబంగా ఎన్నికైన వెంకట్రావమ్మ ఇంటినీ సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంకట్రావమ్మ ఇంటిలో స్వయంగా గ్యాస్ స్టవ్ వెలిగించి కాఫీ పెట్టి కుటుంబ సభ్యులు అందించడంతోపాటు వారితో కొద్దిసేపు ముచ్చటించారు.

...

# సాంప్రదాయం సాంకేతికత మేళవింపు 'ఇంద్రియ'

**ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వానీ**

**విజయవాడలో తన మొదటి స్టోర్‌ను ప్రారంభించిన ఆదిత్య బిర్లా**









**విజయవాడ, మేజర్ న్యూస్ :** 'ఇంద్రియా' సాంప్రదాయాన్ని సాంకేతికతతో కలిపి తన దృక్పథాన్ని మరింత బలపరుస్తుందని ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వాని అన్నారు. శనివారం విజయవాడ నగరంలోని ఎంజీ రోడ్డులో ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన ప్రీమియం జువెల్లరీ బ్రాండ్ 'ఇంద్రియా' మొదటి స్టోర్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జువెల్లరీలో ఈ అద్భుతమైన నైపుణ్యం వినియోగదారులకు మరింత చేరువ చేస్తుందని, భారత ఆభరణాల పట్ల ఉన్న ప్రేమను మరింత గొప్పదిగా మార్చుతోందన్నారు. అనంతరం ఇంద్రియా సీఈఓ సందీప్ కోహ్లీ మాట్లాడుతూ ఆభరణాలు ఇప్పుడు కేవలం పెట్టుబడి గమ్యంగా కాకుండా, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన స్టేట్మెంట్‌గా మారుతున్నాయన్నారు. ఇంద్రియాలో ప్రత్యేకత, వినూత్న డిజైన్లు, వ్యక్తిగత సేవ, స్థానిక సాంస్కృతిక స్పర్శలపై ఆధారపడి మా ఉనికిని నిర్మించుకున్నాం. సంప్రదాయం, ఆధునికత కలిసే విజయవాడ వంటి నగరం, మా దృక్పథానికి పరిపూర్ణ వేదిక అని అన్నారు. ఈ ప్రారంభంతో, వారసత్వాన్ని, నవీనతను మెచ్చే వినియోగదారులకు మా ప్రత్యేక శిల్పనైపుణ్యాన్ని అందిస్తున్నామ' అని తెలిపారు. ఆదిత్య బిర్లా గ్రూప్ నమ్మకమైన వారసత్వం ఇప్పుడు 'ఇంద్రియా' ద్వారా అత్యుత్తమ ఆభరణాల రూపంలో ఈ నగరంలో ప్రవేశించిందన్నారు. హైదరాబాద్‌లో మూడు స్టోర్లు తర్వాత దక్షిణ భారతదేశంలో ఇది నాలుగో స్టోర్‌గా నిలిచింది. వాణిజ్యపరంగా చురుకైన ప్రాంతమైన ఎంజీ రోడ్, కృష్ణా నదికి సమీపంలో ఈ స్టోర్ స్థాపించడం ద్వారా స్థానిక వినియోగదారులకు ప్రీమియం అనుభవం అందించేందుకు ముందడుగు వేసిందన్నారు. వెడ్డింగ్ కలెక్షన్ను ప్రధానంగా ప్రదర్శించే ఈ స్టోర్ నగరంలోని సంప్రదాయ వివాహ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని, ఇంద్రియాకు ప్రత్యేకతగా నిలిచే 'కారిగర్ రూమ్'లో నిపుణులైన కళాకారులు జ్యూవెల్లరీ తయారీని ప్రత్యక్షంగా చూపిస్తూ.. వారసత్వ శైలిని ఆధునిక డిజైన్‌తో మేళవిస్తున్నారన్నారు. గత జూలైలో మొదటి స్టోర్ ప్రారంభించిన తర్వాత ఇంద్రియా దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తూ ఇప్పటివరకు 20 స్టోర్లు ప్రారంభించింది. ఢిల్లీలో ఐదు, ముంబయి, హైదరాబాద్‌లలో మూడేసి, అహ్మదాబాద్, జైపూర్, పుణెలో రెండేసి, లక్నో, ఇండోర్, సూరత్‌లలో ఒక్కొక్కటి ఉన్నాయి. ఈ స్టోర్తో ఇంద్రియా దక్షిణ భారతదేశానికి మరింత దగ్గరైంది. విజయవాడ ప్రాచీన సాంస్కృతిక, పురాణ వారసత్వాన్ని కలిగి ఉన్న నగరం. ఆంధ్రప్రదేశ్‌లో రెండో అతిపెద్ద జనాభా కలిగిన ఈ నగరం, వాణిజ్యం, సంస్కృతి, విద్యా రంగాల్లో కీలక కేంద్రంగా నిలుస్తుంది. విలాసవంతమైన రిటైల్ మార్కెట్ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, సున్నితమైన కళాత్మక నైపుణ్యానికి గల గౌరవం విజయవాడలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఇంద్రియా జువెల్లరీ ప్రారంభం దక్షిణ భారతదేశం పట్ల బ్రాండ్ చూపుతున్న నిబద్ధతకు నిదర్శనం. ఇది సంప్రదాయాన్ని ఆధునిక శైలితో సమపాళ్లలో మిళితం చేస్తూ ముందడుగు వేసింది. 20,000 పైగా ఆభరణాల, 5,000 పైగా ప్రత్యేక డిజైన్లతో ఇంద్రియా దక్షిణ భారతదేశంలో పెరుగుతున్న లగ్జరీ మార్కెట్‌లోకి బలంగా ప్రవేశించింది. ఇక్కడ ఆలయ ఆభరణాలు, వారసత్వ డిజైన్లు, ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్ మధ్య 'ఆంధ్రప్రదేశ్ వాణిజ్య రాజధాని'గా పేరొందిన విజయవాడ విలాసవంతమైన ఆభరణాల రంగంలో కీలక గమ్యస్థానంగా మారుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య బిర్లా జ్యువెలరీ, ఇంద్రియ హెడ్ రిటైల్, మర్చండైజింగ్ అనంతనారాయణన్ హరిహరన్, ఇంద్రియ సీయమ్‌ఓ శాంతిస్వరూప్ పాండా పాల్గొన్నారు.

# దళిత జాతిరత్నం డాక్టర్ బాబు జగజీవన్ రామ్

**ఎంఆర్పీఎస్ ఉత్తర కోస్తా జిల్లాల ఇంచార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా విజయవాడ, కేసరపల్లిలో జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి, నున్నలో జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎంఆర్పీఎస్ ఉత్తర కోస్తా జిల్లాల ఇంచార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ మాట్లాడుతూ భరత జాతి ముద్దుబిడ్డ, దళిత జాతిరత్నం డాక్టర్ బాబు జగజీవన్ రామ్ స్ఫూర్తిదాయకమైన జీవిత విశేషాలు గురించి, తన 14 వ ఏళ్ళకే ప్రాథమిక పాఠశాలలో దళిత కుండను పగలగొట్టి కుల వివక్షతను వ్యతిరేకించిన విధానం, స్వతంత్ర సమరయోధుడిగా గాంధీజీ తో కలిసి నడవడం, బీహార్లో భూకంపం సంభవించినప్పుడు అక్కడ ఆయన అందించిన సేవలు, దాదాపు 50 ఏళ్ల పాటు కేంద్ర పార్లమెంటు సభ్యుడిగా, అందులో 32 ఏళ్ల పాటు వివిధ శాఖలకు కేంద్ర మంత్రిగా, రెండేళ్ల పాటు దేశ ఉప ప్రధానిగా ఆయన ఈ దేశానికి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవాడ అర్బన్ నుంచి లింగాల నరసింహులు మాదిగ, కంపాటి వెంకటేశ్వరరావు మాదిగ, కటికాల సైదులు మాదిగ, ఇసుకపల్లి చంటి మాదిగ, బేతపూడి జనార్ధన్ మాదిగ, అశోక్ మాదిగ, నున్న, కేసరపల్లిలో మంద వేణు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.





# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం..



**విజయవాడ, మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప సంఘసంస్కర్త, రాజకీయ వేత్త బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ పేదవర్గాల సంక్షేమానికి ఎంతో కృషిచేశారని, విలువలతో కూడిన రాజకీయ జీవితం గడిపారన్నారు. అంతటి మహనీయుని జీవితాన్ని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో అంటరానితనం, కులవివక్షను రూపుమాపేందుకు కృషిచేశారని, ఆయన చేసిన సేవలను ప్రజలలోనికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, బాబు జగ్జీవన్ రామ్ అందించిన స్ఫూర్తితో సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి నేటి యువత కృషిచేయాలన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999

